# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 112 క్రిష్ణా, శనివారం 17 - 01 - 2026 పేజిలు : 4 వెల. 2 /-







## కోడి పందేలు, జల్లికట్టు వారసత్వంగా వచ్చినవే..

### చిన్నప్పుడు అన్నీ చూశాః చంద్రబాబు



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 16,** అందరికీ పుట్టిన ఊరు జన్మభూమిపై మమకారం ఉండాలని సీఎం చంద్రబాబు అన్నారు. ఈ మధ్యకాలంలో ఆర్థిక అసమానతలు ఎక్కువయ్యాయని అందుకే పీ4 ను తీసుకొచ్చామన్నారు. 10 లక్షల కుటుంబాలను పీ4 ద్వారా దత్తత తీసుకున్నామన్నారు. సంక్రాంతి రైతుల పండుగని, పెద్దల పండుగ గా పూర్వీకులకు పూజలు చేసుకుని నివాళులు అర్పించాలన్నారు. రైతులు ఆనందం ఉన్నారని వారసత్వంగా జల్లికట్టు, కోడి పందేలు జరుపుకుంటున్నామన్నారు. చిన్నప్పుడు ఇవన్నీ సంప్రదాయంగా జరుకున్నామన్నారు. పండుగలు ఆనందాన్ని ఇస్తాయన్నారు.

పెద్దల పండగ సంక్రాంతిని సొంతూరు నారావారిపల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంబరంగా జరుకున్నారు. నాలుగు రోజుల పాటు నారావారి పల్లి లోనే కుటుంబ సభ్యులు బంధువులతో గడిపిన సీఎం సంక్రాంతి రోజు గ్రామ దేవత దొడ్డి గంగమ్మ, నాగాలమ్మకు, తల్లిదండ్రుల సమాధులకు పూజలు నిర్వహించారు. ఎన్టీఆర్ బసవతారకం విగ్రహాలకు నారా నందమూరి కుటుంబ సభ్యులతో కలిసి నివాళులు అర్పించిన చంద్రబాబు మీడియా సమావేశం నిర్వహించారు.

స్వర్ణ నారావారిపల్లి ద్వారా జీవన ప్రమాణాలు పెంచుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. హంద్రీ నీవా నీటిని మూలపల్లి చెరువు ద్వారా కళ్యాణి డ్యామ్ కు తరలిస్తామన్న సీఎం ఆరోగ్యకరమైన సమాజం రావాల్సి ఉందన్నారు. కుప్పంలో సంజీవినీ ప్రోగ్రామ్ సక్సెస్ అయ్యిందని ఈ ఏడాదిలో సంజీవిని కార్యక్రమం రాష్ట్రమంతా అమలు చేస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఇక జనాభా తగ్గిపోతోందని దానిపై దృష్టి పెట్టామన్నారు. రాబోయే ఏడాదిలో ఎక్కడికక్కడ ఆదాయం పెంచే ప్రయత్నం చేస్తామన్నారు. అవిలాల చెరువు హైద్రాబాద్ ట్యాంక్ బండ్ కంటే బాగా అభివృద్ధి చేస్తామన్నారు. తిరుపతి, విశాఖ, అమరావతిలను మెగా సిటీలుగా అభివృద్ధి చేస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు.

ఎట్టకేలకు శెట్టిపల్లి భూములకు పరిష్కారం

సీఎం దిశానిర్దేశంతో 636 ఎకరాల శెట్టిపల్లి భూములకు పరిష్కారం లభించింది. లాటరీ పద్ధతిలో పారదర్శకంగా 2,111 మందికి పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా రూ.16 కోట్ల రిజిస్ట్రేషన్, స్టాంప్ ఫీజు మినహాయింపు ఇచ్చారు. ల్యాండ్ పూలింగ్ విధానంలో భూముల పంపిణీ చేసిన ప్రభుత్వం శెట్టిపల్లి ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందనుందన్న సంకేతాన్ని ఇచ్చింది. చాలా కాలం నుండి పరిష్కారం కాని శెట్టిపల్లి భూముల సమస్యను పరిష్కరించి ఆన్లైన్ లాటరీ పద్ధతిలో భూములు కేటాయించింది.

స్వర్ణ నారావారిపల్లి గ్రామీణాభివృద్ధిలో దేశానికే దిక్సూచి

స్వర్ణకుప్పం, స్వర్ణ నారావారిపల్లి తరహాలోనే సుస్థిరాభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. స్వర్ణ చంద్రగిరి మండల అభివృద్ధి ప్రణాళికలను ప్రకటించిన సీఎం చంద్రబాబు అధికారులతో సమీక్ష నిర్వహించారు. చంద్రగిరి మండలాన్ని అభివృద్ధి నమూనాగా తీర్చిదిద్దేందుకు స్వర్ణ చంద్రగిరి ప్రణాళికల్ని సీఎం ప్రకటించారు. లక్ష్యాన్ని సాధించేందుకు వీలుగా సీఎం ప్రణాళికల్ని అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. చంద్రగిరి మండలంలో ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా ఈ అభివృద్ధి ప్రణాళికలను అమలు చేయనున్నారు.

గత ఏడాది సంక్రాంతికి ప్రారంభించిన స్వర్ణ నారావారిపల్లె ప్రాజెక్టు ద్వారా ఒక్క ఏడాదిలోనే అద్భుతమైన ఫలితాలు వెలుగు చూశాయి. ఏడాది కాలంలోనే అన్ని ఇళ్లకూ వంద శాతం సౌర ప్యానెళ్లను అమర్చడం ద్వారా ఇంధన స్వయం సమృద్ధిని సాధించింది. తద్వారా ప్రతీ ఇంటికీ ఉచితంగానే విద్యుత్ వెలుగులు వచ్చాయన్నారు.వంద శాతం సోలారైజేషన్ సాధించిన గ్రామంగా స్వర్ణ నారావారిపల్లె రికార్డులు సాధించగా ప్రజల తలసరి ఆదాయం లోనూ గణనీయమైన వృద్ధి నమోదైందన్నారు. శాస్త్రీయ పద్ధతుల్లో పాడిపరిశ్రమను ప్రోత్సహించడం, ప్రకృతి సేద్యం విస్తరణ తదితర ప్రణాళికల ద్వారా తలసరి ఆదాయం 20 శాతం మేర పెరిగిందన్నారు.

ముఖ్యమంగా మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేలా ప్రత్యేక కార్యక్రమాలను సమర్థంగా అమలు చేశామని సీఎం తెలిపారు. దీంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సంతృప్త స్థాయిలో ప్రతీ లబ్దిదారుడికి చేరేలా అమలు చేయటంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పన స్వర్ణ నారావారిపల్లె ఏడాదిలోనే అద్భుత ఫలితాల సాధనకు ఉపకరించిందన్నారు. దీంతో చంద్రగిరి మండలం అంతటా ఈ ప్రాజెక్టును విస్తరించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. గత ఏడాది సంక్రాంతి పండుగ రోజు ప్రారంభించిన స్వర్ణ నారావారిపల్లె ప్రాజెక్టు సమగ్ర గ్రామీణాభివృద్ధిలో దేశానికే దిక్సూచిగా నిలిచిందన్నారు. ఏడాది కాలంలో మూడు గ్రామ పంచాయతీల పరిధిలో ఈ ప్రాజెక్టు ఆశించిన లక్ష్యాలను మించి ఫలితాలను సాధించిందన్నారు స్వల్ప కాలంలోనే ఈ అభివృద్ధి సాధించేందుకు కారణమైన జిల్లా యంత్రాంగాన్ని, ప్రజాప్రతినిధుల్ని చంద్రబాబు అభినందించారు.

## ఊరూరా పండుగ

ఉత్సాహంగా పాల్గొన్న యువత

జోరుగా సాగిన కోడిపందేలు

నియంత్రించలేక పోయిన పోలీసులు


ఎన్ఆర్ఐల రాకకు ట్రంప్ దెబ్బ

చివరి రోజు తెప్పోత్సవాలు, పార్వేట




**క్రైం కౌంటర్ న్యూస్** తిరుగు ప్రయాణంలో జిల్లావాసులుఒంగోలు, జనవరి 16: సంక్రాంతి సంబరాలు మూడు రోజులు ఘనంగా జరిగాయి. పల్లె మొదలు నగరాల వరకు సందడి వాతావరణం నెల కొంది. పలు సాంస్కృతిక కార్యక్రమాలలో యువత ఉత్సాహంగా పాల్గొని సందడి చేసింది. పండుగకు రెండు, మూడు రోజులు ముందు నుంచే జిల్లాలోని పలుచోట్ల ముగ్గులు, క్రికెట్, కబడ్డీ ఇతరత్రా పోటీలు ప్రారంభమయ్యాయి. పండుగ రోజుల్లో మరింత అధికంగా జరిగాయి. చాలాచోట్ల ఎడ్లపందేలను నిర్వహించారు. ఉలిచిలో పొట్టేళ్ల పందేలు జరిగాయి. జిల్లాలోని సుమారు రెండు వందలకుపైగా గ్రామాల్లో ఇలా క్రీడలు, ముగ్గుల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్లు సమాచారం. చిన్నపెద్ద దేవాలయాలు అన్నింటిలోనూ భక్తులు పెద్దఎత్తున పూజలు చేశారు. కనుమ సందర్భంగా తెప్పోత్సవాలు భారీగానే జరిగాయి. శుక్రవారం రాత్రి ఒంగోలులో నిర్వహించిన తెప్పోత్సవంలో ఎంపీ మాగుంట శ్రీనివాసు లరెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. మరోవైపు సంక్రాంతికి సాధారణంగా వచ్చే ఎన్ఆర్ఐలు ప్రత్యేకించి అమెరికాలో ఉద్యోగాలు చేసుకు నే జిల్లావాసులు ఈసారి పెద్దగా రాలేకపోయారు. ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ విధానాలు వారి రాకపోకలకు ప్రతి బంధకంగా మారడంతో చాలామంది ఆగిపోయారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలు, ఇతర రాష్ట్రాలలో ఉద్యోగ, వ్యాపార, ఇతరత్రా వృత్తుల్లో ఉన్న జిల్లావాసులు పెద్ద సంఖ్యలోనే పండుగకు సొంతూళ్లకు వచ్చారు. అలాంటి వారంతా తిరిగి తాము నివసిస్తున్న ప్రాంతాలకు బయల్దేరారు.

## అక్రమ బెట్టింగ్, జూదంపై కేంద్రం ఉక్కుపాదం.. 242 వెబ్‌సైట్లు బ్లాక్




**క్రైం కౌంటర్ న్యూస్,** ఢిల్లీ, జనవరి16 : అక్రమ బెట్టింగ్, ఆన్‌లైన్ జూదంపై కేంద్ర ప్రభుత్వం కఠిన వైఖరి ప్రదర్శిస్తోంది. యువతను మత్తులోకి నెట్టేస్తున్న ఈ అక్రమ కార్యకలాపాలకు చెక్ పెట్టే దిశగా 242 బెట్టింగ్, జూదం వెబ్‌సైట్లను కేంద్ర ప్రభుత్వం బ్లాక్ చేసింది. అంతేకాదు.. ఇప్పటివరకు బెట్టింగ్, జూదాన్ని ప్రమోట్ చేస్తున్న దాదాపు 8 వేల వెబ్‌సైట్లపై చర్యలు తీసుకున్నట్లు కేంద్రం వెల్లడించింది. ఇటీవల రియల్ మనీ గేమింగ్ యాప్‌లపై నిషేధం విధించిన కేంద్రం.. ఇప్పుడు అక్రమ వెబ్‌సైట్లపైనా ప్రత్యేక దృష్టి సారించింది

యువత భవిష్యత్తుపై ప్రభావం..

బెట్టింగ్, ఆన్‌లైన్ జూదం కారణంగా యువత పెడదోవ పడుతున్నట్లు గుర్తించింది. దీనివల్ల కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని, అప్పుల ఊబిలో కూరుకుపోతున్న ఘటనలు పెరుగుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఈ పరిణామాలు సమాజానికి తీవ్రమైన ముప్పుగా మారుతున్న నేపథ్యంలోనే కఠిన చర్యలకు ఉపక్రమించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

ఆన్‌లైన్ గేమింగ్ యాక్ట్, 2025 అమలు..

గతేడాది అక్టోబర్‌లో కేంద్ర ప్రభుత్వం ఆన్‌లైన్ గేమింగ్ యాక్ట్ 2025ను తీసుకొచ్చింది. ఈ చట్టం ద్వారా నగదుతో ముడిపడిన ఆన్‌లైన్ గేమింగ్‌పై నిషేధం, రియల్ మనీ గేమ్స్‌కు కఠిన నియంత్రణలు అక్రమ బెట్టింగ్, జూదాన్ని అరికట్టే విధానాలు అమల్లోకి వచ్చాయి.

రియల్ మనీ గేమ్స్‌కు స్వస్తి..

కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో.. వింజో, నజారా టెక్నాలజీస్‌వంటి ప్రముఖ ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్స్ కూడా రియల్ మనీ గేమ్స్‌కు స్వస్తి చెప్పాయి..

8 వేల వెబ్‌సైట్లపై చర్యలు..

కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ ఆధ్వర్యంలో బెట్టింగ్, జూదాన్ని ప్రోత్సహిస్తున్న వెబ్‌సైట్లు, విదేశీ సర్వర్ల నుంచి పనిచేస్తున్న అక్రమ ప్లాట్‌ఫామ్స్ సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తున్న సైట్లను గుర్తించి ఇప్పటివరకు దాదాపు 8 వేల వెబ్‌సైట్లపై చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

యువత రక్షణే లక్ష్యం..

ఈ చర్యల ప్రధాన ఉద్దేశం యువతను మానసిక, ఆర్థిక నష్టాల నుంచి కాపాడటం, ఆన్‌లైన్ వ్యసనాలకు చెక్ పెట్టడం, సురక్షిత డిజిటల్ వాతావరణం సృష్టించడం అని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. కేంద్రం సూచనల ప్రకారం.. అక్రమ బెట్టింగ్ యాప్‌లపై నిఘా మరింత పెంచనున్నారు. సోషల్ మీడియా ప్రమోషన్లపై చర్యలు తీసుకోనున్నారు. చట్ట ఉల్లంఘనకు పాల్పడే సంస్థలపై కఠిన శిక్షలు విధించనుంది.

## మావుళ్లమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



**క్రైం కౌంటర్ న్యూస్,** భీమవరంటౌన్, జనవరి 16 మావుళ్లమ్మను దర్శించుకునేందుకు భక్తులు క్యూట్టారు. పండగ సెలవులు పూర్తి కావడంతో అమ్మవారి దర్శ నానికి భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసర ప్రాంతాలన్ని కిటికిటలాడాయి. మధ్యాహ్నం 1 గంట ప్రాంతానికి భక్తుల క్యూలైన్ ఆలయం వద్ద నుంచి యూనియన్ బ్యాంకు రోడ్డులో సాగిపోయింది. అమ్మవారి ఆలయం వద్ద పందిర్లు భక్తులతో నిండిపోయాయి. సాయంత్రం వరకు కొనసాగింది. ఆది వారం వరకు ఈ రద్దీ కొనసాగే అవకాశం ఉంది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఆలయ ఇవో బుద్ధా మహాలక్ష్మినగేష్, ఆలయ ఛైర్మన్ బొండాడ నాగభూషణం పర్యవేక్షించారు. ఆలయ ప్రాంతంలో బందోబస్తును డీఎస్పీ రఘువీర్ విష్ణు దగ్గర ఉండి పర్యవేక్షించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు ఆలయవద్ద ఏర్పాటు చేసిన కంట్రోల్ పాయింట్‌లోని సీసీ కెమెరానలు వన్‌టౌన్ సిఐ నాగరాజు పర్యవేక్షించి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో పాటు వీఐపీల తాకిడి కూడా ఎక్కువగా ఉంది. రాత్రి కూడా ఆలయం వద్ద రద్దీ కొనసాగింది. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణను చూసేందుకు రావడంతో లైటింగ్ ఏర్పాటు చేసిన రోడ్లు కిక్కిరిసిపోయాయి. భక్తులకు నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో భోజన ఏర్పాట్లు చేశారు. ఆలయం వద్ద సాయంత్రం నుంచి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

## ఇవాళ సాయంత్రం 6 గం.లకు కీలక ప్రకటన కోసం వేచి ఉండండి: మంత్రి లోకేశ్

**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 16,** అమరావతి: గ్రీన్ ఎనర్జీ రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దనున్నట్లు మంత్రి నారా లోకేశ్ తెలిపారు. కాకినాడ కేంద్రంగా జర్మనీ, సింగపూర్, జపాన్‌కు గ్రీన్ ఎనర్జీ సరఫరా చేసే దిశగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. మొత్తం 10 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో సుమారు 8 వేల మందికి ఉద్యోగాలు కలగనున్నాయని వెల్లడించారు. ఈ అంశంపై శుక్రవారం సాయంత్రం 6 గంటలకు కీలక ప్రకటన ఉంటుందని, అప్పటి వరకూ వేచి ఉండాలని మంత్రి పేర్కొన్నారు.



